క్లుప్తంగా

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు



అక్షరాభ్యాస కార్యక్రమాలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామ శివారులోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి దేవి క్షేత్రంలో భక్తులు విశేష పూజలు నిర్వహించుకున్నారు. శ్రావణ మాస శ్రీ వెంకయ్య స్వామి ఆరాధన సందర్భంగా శనివారం దక్షిణాయం శుక్ల పక్షం రోజున ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శమిచ్చారు. భక్తులు అమ్మవారి విశేష పూజలు చేసుకున్నారు. అనంతరం 30 మంది చిన్నారులకు ఆలయ పురోహితులు తల్లిదండ్రులతో కలసి బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసాలు చేయించారు.

ఇంటర్ విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ షేక్షావలి

నందికొట్కూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం ప్రిన్సిపాల్ షేక్షావలి బ్యాగులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకొని మంచిగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి



స్వీట్ పొంగల్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన రుచికరమైన భోజనం తయారు చేసి పెట్టాలని మండల విద్యాధికారి సుభాన్ ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. స్వీట్ పొంగల్‌లో తీపి తక్కువగా ఉందని, అన్నంలో పురుగులు వస్తున్నాయని పిల్లల తల్లిదండ్రులు ఎంఈఓ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎంఈఓ భోజనాన్ని రుచికరంగా తయారు చేయాలని, లేదంటే త్రీ మెన్ కమిటీ ద్వారా ఏజెన్సీని తొలగిస్తామని నిర్వాహకులను హెచ్చరించారు.

శిశువు మృతిపై విచారణ



స్టాఫ్ నర్సు సౌజన్యను విచారిస్తున్న పీఓ, ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్

పాములపాడు: వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే డెలివరీ అయిన వెంటనే శిశువు మృతి చెందాడని ఆరోపిస్తూ శనివారం ఉదయం ఆసుపత్రి వద్ద చేసిన ఆందోళన పై ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కాంతారావు నాయక్, ఎఫ్‌డీఓ నోడల్ ఆఫీసర్ జగదీష్, ఏఓ డాక్టర్ భరత్ స్థానిక పీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్‌షా, స్టాఫ్‌నర్సు సౌజన్యలను విచారించారు. అలాగే బాధితురాలు సునీత, కుటుంబ సభ్యులను విచారించారు. వారు చెప్పిన అన్ని విషయాలను నోట్ చేసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు దూరం



కపిలేశ్వరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు దరిచేరవని వైద్యులు జబీర్ సూచించారు. మండలంలోని ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఎర్రమఠం, ఎర్రమఠం గూడెం గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, కాచిన నీటిని తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల సీజనల్ వ్యాధులు మన దరిచేరకుండా ఉంటాయన్నారు. అలాగే అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వరప్రసాద్ రెడ్డి వైద్యసిబ్బందితో కలసి కపిలేశ్వరం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అలాగే గొర్రెల కాపర్లు, గొర్రెలను మేపడానికి అటవీ ప్రాంతంలోకి వెళ్తారని, వారి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సిబ్బందికి సూచించారు. శిబిరంలో హెల్త్ అసిస్టెంట్లు శాంతమ్మ, సత్యం రెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రుల వద్ద సెక్యూరిటీని పెంచాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం అమానుషం. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రుల వద్ద సెక్యూరిటీని పెంచాలి, మంచి ప్రవర్తన కలిగిన వారిని సెక్యూరిటీ గార్డులుగా తీసుకోవాలి. షిఫ్ట్‌కు ఇద్దరు ఉండేలా ఉంటే బాగుంటుంది. మహిళా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందికి ప్రత్యేక వాష్‌రూంలు, రెస్ట్ రూంలు ప్రతి ఆసుపత్రిలో ఉండాలి. నిరంతర సిసి కెమెరాల నిఘా స్టోరేజ్‌తో కూడినదిగా ఉండాలి. ఎమర్జెన్సీ అటెండ్‌కు ఇంటి నుంచి ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తే రక్షణగా ఫీల్ అవుతాం. ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలకే దిక్కు లేకపోతే మాకు రక్షణ లేనప్పుడు రోగికి సత్వర వైద్యం అందడంలో జాప్యం జరిగే వీలుంది.

–డాక్టర్ ఝాన్సీరాణి, అనస్థీషియా, సీహెచ్‌సీ, సున్నిపెంట



ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి



సమజం బాగు కోసం అందరూ కలిసి రావాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన సంఘటన ఘోరమైనది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో మహిళా డాక్టర్ పై జరిగిన ఉదంతం ఒక పెద్ద స్కాం. ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తుండటంతోనే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయి. డాక్టర్ వృత్తిలో కొందరు మాత్రమే నిజాయితీగా ఉన్నారు. మరి కొందరు స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నారు.

–సావిత్రి, ఆయుర్వేద వైద్యాధికారిణి, పాములపాడు

రైతన్నకు దక్కని భరోసా

- పెట్టుబడి సాయం మరచిన కూటమి ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ నగదు కోసం వేచిచూస్తున్న అన్నదాతలు
- సాగుకోసం అప్పులపాలు



ఖరీఫ్‌లో రైతన్నలు సాగు చేసుకున్న వరి పైరు

కొత్తపల్లి: గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే వచ్చేల రూపకల్ప చేసి అమలు చేశారు. అందులో భాగంగా ప్రతి ఏటా రెండు దఫాలుగా రైతన్నల సాగు పెట్టుబడి కోసం రైతు భరోసా పథకాన్ని అమలు చేసి, సకాలంలో నగదు జమ చేసేవారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొటేందుకు యత్నిస్తోంది. అందులో భాగంగా ఇప్పటి వరకూ రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవ పథకం ఊసేత్తడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం రైతుకు ఇచ్చే భరోసా భ్రమేనా అన్న చందంగా మారింది.

5,2373 మంది రైతులు

నందికొట్కూరు నియోజకవర్గంలో మొత్తం 5,2373 మంది రైతులు ఉన్నారు. వీరిలో 4,855 మంది కౌలు రైతులు, 46,918 మంది సాధారణ రైతులు ఉండగా వీరికి అన్నదాత సుఖీభవ కింద ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున మొత్తం రూ.1,04,74,60,000 ఖర్చు చేయాల్సి వస్తుంది. అయితే ఇందులో మొదటి విడతగా జూలై నెలలో అందాల్సిన సాయం రూ.39,27,97,500 ఇంతవరకూ రాలేదని కర్షకులు కూటమి ప్రభుత్వంపై కన్నెర్ర చేస్తున్నారు.

పెట్టుబడుల కోసం అప్పులు

ఖరీఫ్ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, వరి, కంది, పత్తి, మినుము పంటలను సాగుచేసుకున్నారు. పంటలు సాగుచేసుకొని 2 నెలలు పూర్తియినా ఇంతవరకూ పెట్టుబడి సాయం అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడెప్పుడు రైతుభరోసా నగదు బ్యాంకు ఖాతాలలో జమ అవుతుందా అని వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సాగుకోసం రైతన్నలు ఇతరుల వద్దకు వెళ్లి అప్పులు చేస్తూ అప్పుల ఊబిలో పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జూలై నెలలోనే రైతన్నల బ్యాంకు ఖాతాలలోకి పెట్టుసాయం వేసేదని, ఇప్పటి ప్రభుత్వం ఎందుకు వేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయం కూటమి ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయింది. సూపర్ సిక్స్ హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు తుంగలో తొక్కారని విమర్శిస్తున్నారు.

రైతు భరోసా వచ్చింటే ఊరటగా ఉండేది



ఈ ఖరీఫ్ సీజన్‌లో నాకున్న రెండు ఎకరాల్లో మొదట మొక్కజొన్న పంటవేశా. దీని సాగుకు రూ.30 వేలుదాకా ఖర్చు వచ్చింది. అధికవర్షాలతో మొక్కజొన్న దెబ్బతింది. దాన్ని తీసివేసి ఇప్పుడు రెండు ఎకరాలలో పొగాకు పంట నాటిస్తున్నాను. దీనికి దాదాపుగా రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకు రూ.60వేలు ఖర్చు చేసి నష్టపోయా. రైతుభరోసా వచ్చింటే కొంత ఊరటగా ఉండేది. ఖర్చు పెరగడంతో వ్యవసాయం భారమవుతుంది.

–సుధాకర్ రెడ్డి, రైతు, పీరుసాహెబ్ పేట, మిడుతూరు

అప్పుచేసి పంటలు సాగుచేస్తున్నా..



నేను నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంటను సాగుచేస్తున్నా. ఇప్పటి వరకు సుమారు 30 వేల రూపాయాల దాకా ఖర్చు చేశా. రైతు భరోసా పడితే ఆర్థికంగా చేయూత లభించేది. డబ్బులు లేక అప్పుచేసి మరి పంటలను సాగు చేస్తున్నా. రైతు భరోసా పడింటే అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ఉండేది. ప్రభుత్వం త్వరగా రైతుభరోసా ఇవ్వాలి.

–చంద్రమౌళి కౌలు రైతు, గువ్వలకుంట్ల, కొత్తపల్లి

మనిషిలో మార్పు రావాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు: మనిషిలో మార్పు వచ్చినప్పుడే మంచి వాడని, ప్రజల నుంచి మద్దతు లభిస్తుందని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రౌడీయిజం చేస్తే తాట తీస్తానని హెచ్చరించారు. శనివారం పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 50 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రౌడీయిజం వదిలేసి మంచి ప్రవర్తనతో జీవనం కొనసాగించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మిడుతూరు ఎస్ఐ ఓబులేసు, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



జూపాడుబంగ్లా మోడల్‌స్కూల్‌లో కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

జూపాడుబంగ్లా: ఈనెల 26న కృష్ణాష్టమిని పురస్కరించుకొని మండల కేంద్రమైన జూపాడుబంగ్లా మోడల్ పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు ముందుగా కృష్ణాష్టమి విశిష్టత, ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో ఉట్టికొట్టించటంతో పాటు కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నందికొట్కూరు: పట్టణంలోని స్కాలర్ స్కూల్‌లో ముందస్తుగా శ్రీ కృష్ణుడి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణలో చిన్నారులు పలువురిని ఆకట్టుకున్నారు.

నిర్దిష్ట కొలతల ప్రకారమే హైవే నిర్మాణం

పాములపాడు: నేషనల్ హైవే నిర్మాణ పనులు నిర్దిష్ట కొలతల ప్రకారమే జరుగుతాయని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామస్తులు హైవే కోసం నిర్దేశించిన కొలతల ప్రకారం కాకుండా ఎక్కువగా స్థలం తీసుకుంటున్నారని ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్, ఎస్ఐ సురేష్‌బాబు సమక్షంలో మళ్లీ సర్వే చేయించారు. మండల సర్వేయర్ భాస్కర్ కొలతలు వేశారు. గ్రామానికి చెందిన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు చెందిన 12 సెంట్ల స్థలంలో 5 సెంట్ల స్థలం రోడ్డు నిర్మాణ పనుల్లో సేకరించుకున్నారన్నారు. కాగా 5 మీటర్లు ఎక్కువగా స్థలంలో పనులు చేసేందుకు రావడంతో అడ్డుకున్నట్లు చెప్పారు. మరలా సర్వే చేసిన అధికారులు కొలతలు వేయడంతో న్యాయం జరిగిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాన్స్‌ఫార్మర్..

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలా చూస్తామని ట్రాన్స్‌కో ఏడీఏ రమేష్ అన్నారు. గ్రామంలో హెవే నిర్మాణ పనుల్లో భాగంగా పాత ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిరావడంతో గ్రామస్తుల నుంచి సమస్య వచ్చింది. దీంతో తహసీల్దార్ సుభద్రమ్మ, ఎస్ఐ సురేష్‌బాబులు గ్రామస్తులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల తమకు ఇబ్బందిగా ఉంటుందని లక్ష్మీదేవి అనే మహిళ అభ్యంతరం తెలిపింది. గతంలో విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి చెందాయని వాపోయింది. ప్రభుత్వ స్థలంలోనే త మ ఇంటి వెనుక వైపున ఏర్పాటు చేయాలని కోరింది. హైవేలో 4సెంట్ల ఇంటిని కోల్పోయామని, పరిహారం కేవలం రూ.28లక్షలు ఇచ్చారని వాపోయింది.

సూడోమోనాస్‌తో అగ్గితెగులు నివారణ

నంద్యాల(అర్బన్): సూడోమోనాస్ ద్రావణంలో నారు ముంచి నాటు వేయడం ద్వారా వరిలో అగ్గితెగులును నివారించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని బిల్లలాపురం గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరినారు కత్తరించి సూడోమోనాస్ ద్రావణంలో ముంచి నాటే విధానాన్ని రైతులకు ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు నారు మడిలోని కొనలమీద గుడ్లు పెడుతుందని, నారు కొనలు తుంచి నాటడం వల్ల ఆ గుడ్లు నాశనమవుతాయన్నారు. కాండం తొలుచు పురుగు ఉధృతిని అదుపులో పెడితేనే దిగుబడులు సాధించగలుగుతారన్నారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ నారు వేసేటప్పుడు 25–30రోజుల నారును ఒకటి లేదా రెండు కర్రలతో మాత్రమే నాటాలన్నారు. ఒక చదరపు మీటరుకు 33 కుదుర్లు ఉండేలా నాటుకోవడం ద్వారా మొక్కలకు గాలి బాగా అంది గంట కడుతుందన్నారు. గట్ల మీద కంది నాటుకోవాలన్నారు.

గువ్వలకుంట్లలో పొలంబడి

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఏఓ కె.మహేష్ అధ్యక్షతన పొలంబడి కార్యక్రమాన్ని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి హేమలత శనివారం నిర్వహించారు. కార్యక్రమం ద్వారా పంటల సాగులో పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడిని ఏవిధంగా రాబట్టాలి అన్న విషయాలపై, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ పొలిమేరలోని వరి పంటపొలాలను పరిశీలించారు. వరి పంటలో కాంప్లెక్స్ ఎరువులైన డీఏపీ, 20 20 0 13 ఎరువులను విరివిగా వాడకూడదని సూచించారు. వరిలో జింకు లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు జింకు సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అదేవిధంగా వేపనూనె 5 ఎంఎల్ లీటరు నీటికి కలపి పిచికారీ చేయాలని సూచించారు. అదే విధంగా పొలాల్లో ఎకరాకు 4, 5 లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.



వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి

సంజీవ్‌నగర్ తండాలో..

ఆత్మకూరు: మండలంలోని సంజీవ్‌నగర్ తండా గ్రామంలో శనివారం వరి పంట పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఈఓలు లతమ్మ, వీఏఏ మధు వరిసాగుపై సూచనలు చేశారు. వరినారు కట్టలను సుడోమోనాస్ ద్రావణంలో 30 నిమిషాలు ఉంచి తర్వాత నాటితే తెగుళ్లను నివారించవచ్చన్నారు. నాటేటప్పుడు ఆకు కొనలను తుంచాలని, దీంతో తొలుచు పురుగు, ఆకు ముడత పురుగును నివారించవచ్చన్నారు.

గణపతి గాథలు అంశంపై ప్రవచనాలు





ప్రవచనాలను వినిపిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ, జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అధికారులు ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా తొమ్మిది రోజులపాటు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మవారి దివ్య ప్రవచనాలను ప్రారంభించింది. శనివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై గణపతి గాథలు అంశంపై ప్రవచనాలు ప్రారంభించారు. ముందుగా ఆలయ సంప్రదాయం మేరకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రవాచకులు తమ ప్రవచనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలక్షేత్రం సాక్షాత్తు ఇలలో కైలసం అన్నారు. అటువంటి క్షేత్రంలో సాక్షిగణపతి, రత్నగర్భగణపతి దర్శనమివ్వడం అదృష్టమన్నారు. వేదాలు, ఆగమాలు, పురాణాలు, ఇతిహాలలో గణపతి గాథలు చాలా ఉన్నాయని గుర్తు చేశారు. పార్వతీపరమేశ్వరుల పుత్రుడిగానే కాక గణపతి స్వరూప స్వభావాలు ఇతరత్రా గ్రంథాలలోనూ పుష్కలంగా ఉన్నాయని, సృష్టికి పూర్వమే ఉన్న బ్రహ్మదేవుడికి ఓంకారం గణపతి ఆకారంలో దర్శనం ఇచ్చి సృష్టి రచనకు పుష్టినిచ్చిందన్నారు. గణపతి ఆది నుంచి ఉన్నాడు కనుక ఆయన్ని ఆది పూజ్యుడుగా ఆరాధిస్తున్నామని వివరించారు. ప్రవచనాలకు ముందు సామవేదం షణ్ముఖశర్మ స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకుంటాం

నందికొట్కూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అంగీకరించబోమని చెప్పిన టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే మాట తప్పి స్మార్ట్ మీటర్లు బిగిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఏపీ రైతు సంఘం నాయకులు నాగరాజు, అశోక్ అన్నారు. శనివారం పట్టణంలోని భరత్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ మీటర్లను వ్యతిరేకించి, హైకోర్టుకు వెళ్లి.. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదేశాల మేరకు లొంగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టాలని పిలుపునిచ్చిన టీడీపీ భిన్నంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో రైతులు నాగభూషణం, వెంకటేశ్వర్లు, షాలిమియ్యా పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి ఐఎఫ్‌టీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆశీర్వాదం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా గైనకాలజిస్టు డాక్టర్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శీను, శివలక్ష్మి, అంజి పాల్గొన్నారు.

పెద్దనంతాపురంలో 104 వైద్యసేవలు



చిన్నారికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ పరిధిలోని పెద్దనంతాపురంలో శనివారం 104 వాహన వైద్యసేవలు నిర్వహించారు. వైద్యాధికారి పవన్‌కుమార్ రోగులకు మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేశారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలోనే గర్భిణులు ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, లత, 104 డేటా ఎంట్రీ ఆపరేటర్ రవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ కోర్సులో గెస్ట్ లెక్చరర్ నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ రఘురామ ఆచార్యులు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ పోస్టుకు టెన్త్, ఇంటర్‌తో పాటు డిగ్రీలో బీఎస్సీ అగ్రికల్చర్ అర్హతగా ఉండాలన్నారు. అర్హులైన నిరుద్యోగులు తగిన సర్టిఫికెట్లతో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం చేరుకోవాలని సూచించారు.

నీట్ పీజీలో మెడిసిన్ విద్యార్థుల ప్రతిభ



నాగ శశి ప్రణయ్ రెడ్డి



ఇనుగూరు రాజకుమార్

వెలుగోడు: వెలుగోడు పట్టణానికి చెందిన డాక్టర్ శివరామి రెడ్డి, డాక్టర్ పద్మ దంపతుల కుమారుడు సి నాగ శశి ప్రణయ్ రెడ్డి నీట్ పీజీలో 1,273 ఆల్ ఇండియా ర్యాంకుతో సత్తా చాటాడు. ఈ విద్యార్థి పదవ తరగతిలో 10/10 మార్కులు సాధించారు. ఇంటర్ తర్వాత నీట్‌లో 1,440 ఆల్ ఇండియా ర్యాంకు సాధించి ఛత్తీస్‌ఘఢ్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ప్రస్తుతం వెలువడిన నీట్ పీజీ ఎంట్రెన్స్ ఫలితాలలోనూ 1,273 ఆల్ ఇండియా ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. పట్టణానికి చెందిన ఇనుగూరు శ్రీనివాసులు కుమారుడు రాజకుమార్ నీట్ పీజీ లో 8,200 ఆల్ ఇండియా ర్యాంక్‌తో ప్రతిభ చాటాడు. ఈ విద్యార్థి వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి 9.7 పాయింట్లు సాధించాడు. కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ప్రస్తుతం వెలువడిన నీట్ పీజీ ఎంట్రెన్స్ ఫలితాలలో 8,200 ఆల్ ఇండియా ర్యాంకు సాధించాడు.





పొలంలో పెయింటెడ్ స్టార్క్‌లు

ఎర్రకాళ్ల కొంగల కోలాహలం

ఆత్మకూరు పట్టణ శివార్ల పంటపొలంలో శనివారం ఎర్రకాళ్ల కొంగలు(పెయింటెడ్ స్టార్క్) కోలాహలం కనిపించింది. పొలం చివర్లో నిలిచిన వర్షం నీటిలో ఆహారం వెతుకుతూ పెద్ద కొంగల గుంపు అక్కడ చేరింది. పెయింటెడ్ స్టార్క్‌లు సంతానోత్పత్తి కోసం సుదూర ప్రాంతాల నుంచి దక్షిణ భారత దేశానికి వలస వస్తాయి. హిమాలయ ప్రాంతాల నుంచి జరిగే అంతర్గత వలసతో పాటు ఆస్ట్రేలియా వంటి సుదూర దేశాలనుంచి కూడా వీటి వలస ఉంటుంది. సరైన నీటి వసతి, ఎత్తైన చెట్లు ఉన్న ప్రాంతంలో ఇవి గూళ్లు కట్టుకుని గుడ్లు పెట్టి పిల్లలు ఎగిరే వయసు వచ్చే వరకు ఉండి వేసవి కంతా ఇవి స్వస్థలాలకు చేరుకుంటాయి.పెయింటెడ్ స్టార్క్‌లతో పాటు డాబ్‌చిక్ అనే బాతు జాతి పక్షులు కూడా వీటితో పాటు కనిపించాయి. –ఆత్మకూరురూరల్